



జరిగిన జగన్నాటకం

సవ్యలంకలో కుడి చేతిని వాడి, మరణదండన నుంచి తప్పించుకున్నాడు బోసు. బోసే మహాబసు అని అతణ్ణి నాయకుణ్ణి చేశారు. వామదేవుడు సత్యోద్యమకారులను హతమార్చడంతో శాంతిపోరాటం సాయుధపోరాటంగా మారింది. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్పాడు సారథి. దక్షిణావతం వెళ్ళాలా లేదా అన్న విషయమై సైన్యం రెండు భాగాలుగా విడిపోయింది. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం చెప్పాడు. వర్తకులతో, సిరిగిరితో చర్చలకు వెళ్ళాడు మహాబసు. అనుమానంతో బయట వేచివున్న ఉగ్ర, సుధాముల మీద దళాధిపతి దాడి చేశాడు.

దళాధిపతి బాణం చేసిన గాయం గురించి పట్టించుకోలేదు ఉగ్ర. అతని ఆలోచన మొత్తం మహాబసుని ఎలా కాపాడాలా అన్న విషయం దగ్గరే ఆగిపోయింది. సమావేశం జరుగుతున్నది మందిరానికి ఉన్నది ఒకటే ద్వారం. దళాధిపతి ఏ మాత్రం ఆలోచించకుండా తీసుకోదగ్గ నిర్ణయం ఒకటే. ఆ ద్వారం ముందు సైన్యంతో మొహరించి ఆ తరువాత లోపలికి చొచ్చుకుపోయి మహాబసుని చంపడం, లేదా బంధించడం. అది ఉగ్ర సుధాములు వుండగా చెయ్యడం అంత సులభం కాదని అతనికి కూడా తెలుసు. కాబట్టే ముందు ఉగ్ర మీదకి దాడికి దిగాడు.

ఈ ఆలోచన రావడమే ఆలస్యం ఉగ్ర లేచి నిలబడ్డాడు. అప్పటికే సుధాముడు తన అంబుని తీసి దళాధిపతి వైపు బాణాలను వదలడం మొదలుపెట్టాడు. దళాధిపతి ముందు వున్న కొంతమంది సైనికుల్ని అప్పటికే నేలకొరిగేలా చేశాడతను. శత్రు పక్షం నుంచి వస్తున్న బాణాలు అప్పటికే వాళ్ళ వెనుక వున్న చెట్టుని తూట్లు పొడుస్తున్నాయి. ఉగ్ర కూడా బాణాలను సంధించాడు. మహోగ్రంగా అతని బాణాలు దళాధిపతి సైన్యం మీద విరుచుకుపడసాగాయి.

బాణాలతో సిద్ధంగా వున్న కాల్బలాన్ని ముందుకు పంపించాడు దళాధిపతి. వాళ్ళకు ముందుకు వచ్చి తమ స్థానాలను సిద్ధం చేసుకునే లోపే సగం మంది నేలకి ఒరిగారు. మిగిలినవాళ్ళు వస్తున్న బాణాల వేగానికి ఆశ్చర్యపోయేలోగా మిగిలిన వారిలో సగం పడిపోయారు. ఇక మిగిలినవాళ్ళని కూల్చడానికి ఉగ్ర, సుధాములకి అట్టే సమయం పట్టలేదు.

దళాధిపతి జరుగుతున్నది చూసి కోపంతో ఊగిపోయాడు. మరో దళాన్ని ముందుకు వెళ్ళమని ఆదేశించాడు. వాళ్ళంతా బాణాలకు దొరకకూడదని, ఒక వరుసలో కాకుండా అడ్డదిడ్డంగా ఉగ్ర వైపు పరిగెత్తసాగారు.

"సుధామా వాళ్ళని సంభాళించుకో" అంటూ ఉగ్ర ఒక్క గెంతు గెంతి సమావేశమందిరం ముఖద్వారం దగ్గరకు పరుగెత్తాడు. సుధాముడు వస్తున్న దళం పైన బాణాలను కురిపిస్తూనే ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఉగ్ర వెళ్ళిన వైపుకు కదిలాడు.

ఉగ్ర సమావేశ మందిర ద్వారానికి కాపు కాయడానికి వెళ్తున్నాడని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు దళాధిపతికి. పది మందితో కూడిన మరో దళాన్ని అటు వైపు వెళ్ళమంటూ ఆదేశాలు ఇచ్చాడు. ఆ పదిమంది గట్టిగా అరుస్తూ ఆ ద్వారం వైపు పరుగెత్తారు. ఉగ్ర వాళ్ళ కన్నా వేగంగా ద్వారం వైపు పరుగెత్తాడు. పరుగులోనే బాణాలను కత్తులను వాళ్ళ మీదకు విసిరాడు. ముగ్గురు నేలకొరిగారు. మిగిలిన ఏడుగ్గురు తేరుకునే లోపల అతను ద్వారం వరకు వెళ్ళిపోయింది దానికి అడ్డంగా నిలబడ్డాడు. చేతిలో వున్న అంబుని పక్కన పెట్టి, నడుముకు వున్న కత్తిని తీసి దాన్ని తిప్పుతూ – "జై మహాబసూ" అంటూ పొలికేక పెట్టాడు.

చాలా కొద్ది సమయంలో పరిస్థితి మారిపోయింది. ద్వారం ముందు ఉగ్ర, అతని పక్కనే అనుచరుడు సుధాముడు. వాళ్ళని దాటి లోపలకి వెళ్తా అక్కడ మహాబసు. కానీ వాళ్ళని దాటడం అంత సులభం కాదని అర్థం అవుతూనే వుంది. పరుగెత్తి పరుగెత్తి అక్కడికే చేరిన ఉగ్ర రొప్పుతూ కాలయముడిలా నిల్చోని వున్నాడు. అతని చేతిలో వున్న కత్తి యముడి పాశంలా వుంది.

"దాడి చెయ్యండి" అరిచాడు దళాధిపతి.

అప్పటిదాకా ఉగ్ర, సుధామ గమనించని విషయం ఒకటి వుంది. దళాధిపతితో వచ్చిన సైన్యం కాక ఇంకా దాదాపు వందమంది సైనికులు వచ్చి చేరారు. అంతా ప్రధాన ద్వారం ముందు నిలబడి అటునుంచి ఎప్పుడెప్పుడు మహాబసు వస్తాడా ఎప్పుడెప్పుడు దాడి చేద్దామా అని ఎదురుచూస్తున్నారు. వచ్చినవారిని వచ్చినట్లు దునుమాడుతున్నా వెంటవెంటనే ఇంతింత మంది ఎక్కడ్నుంచి వస్తున్నారా అని తల పైకెత్తి చూశాడు ఉగ్ర. ఆశ్చర్యపోయాడు. మొదటొచ్చిన నలభై యాభై మంది, ఆ పై వచ్చి చేరిన వందమంది కాదు. ఇంకో రెండు మూడు వందల మంది అక్కడికి గుర్రాల మీద చేరుకుంటున్నారు.

మొదటిసారి అపజయం తప్పదనిపించింది ఉగ్రకి. వచ్చే సైన్యాన్ని చూస్తే తననే కాదు మహాబసుని సైతం ఆనవాలు లేకుండా రూపుమాపగలరని నమ్మకం కలిగింది. ఇక ఇప్పుడు చెయ్యాల్సిందేమిటి? పోరాడి చనిపోవడమా? ఓటమిని అంగీకరించి బానిసగా బతకడమా? ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడతను.

<><><>

అప్పటిదాకా వ్యాపార – అధికార సంబంధాల గురించి చర్చించుకుంటున్న సిరిగిరి, మహాబసు బాహ్యప్రపంచంలో జరుగుతున్నదేదీ పట్టించుకోలేదు. కానీ బయట క్రమంగా పెరుగుతూ వచ్చిన కోలాహలాన్ని మొదటగా మహాబసే గుర్తించాడు. అయినా ఏమీ పట్టనట్లు సంభాషణను కొనసాగించాడు

“సరే మీరు చెప్పినట్లే వ్యాపార అధికార సంబంధం అనివార్యమనే అనుకుందాం. అధికారం శాశ్వతం కాదు కదా. అధికారంలో వున్న ప్రభుత్వం పడిపోయినప్పుడు ఆ ప్రభుత్వాన్ని సమర్థించిన వ్యాపారాలు ఏమైపోవాలి? రెండొవది – ఒక ప్రభుత్వం ఆఖరి రోజుల్లోకి వచ్చినప్పుడు తరువాత రాబోయే ప్రభుత్వం ఏదో చూసుకోని తెలివిగా అటువైపు ఫిరాయించే వ్యాపారాలు ఎన్ని మార్పులు జరిగినా అలాగే వుండిపోతాయి కదా?” అడిగాడు మహాబసు.

“మీ ఆలోచన సరిగ్గానే వుంది. కానీ అది అమలుపరచడానికి అనువైన ఆలోచన కాదు. కారణాలు రెండు. మొదటిది ఒక ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వ సిద్ధాంతాలను నమ్మిన వ్యాపారి వెంటనే అభిప్రాయాలు మార్చుకోవడం అంత సులభం కాదు. వ్యాపార అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగత అభిప్రాయాలు మారవు కదా. ఎంత కాదన్నా వ్యాపారి కూడా ఒక మనిషే అతని కూడా కొన్న అభిప్రాయాలు, అభిరుచులు ఒక ప్రభుత్వం మీదో, ఒక వ్యక్తి మీదో నమ్మకం వుండచ్చు. ఎవరో ఎందుకు నన్నే ఉదాహరణగా తీసుకో. నాకు వ్యక్తిగతంగా మహాబసు అంటే ఇష్టం, కానీ ఒక వ్యాపారిగా నేను ప్రస్తుతం వున్న వామదేవుడి ప్రభుత్వానికే మద్దత్తు ఇస్తున్నాను.” చెప్పాడు సిరిగిరి.

'ఎందుకు' అని అడగాలనుపించింది మహాబసుకి. కానీ అడగలేదు.

“రెండో కారణం చెప్పలేదు” అంటూ గుర్తుచేశాడు.

“రెండొవ కారణం కూడా మొదటి కారణం నుంచి పుట్టిందే. ఎలాగైతే ఇప్పుడు వున్న ప్రభుత్వం కొనసాగుతుందన్న నమ్మకం వుంటుందో అలాగే మరో ప్రభుత్వం వస్తుందా రాదా అన్న విషయం మీద వ్యాపారికి ఒక అభిప్రాయం వుంటుంది. ఇప్పుడు మీ సంగతే తీసుకుందాం. వామదేవుడి ప్రభుత్వం కూలిపోయి మహాబసు ప్రభుత్వం వస్తుందన్న నమ్మకం వుండాలి. అలా వుంటే మీ వాదననే అంగీకరించి కుడి చేతిని ప్రధానంగా వాడేందుకు అవసరమైన వస్తువులను తయారు చేస్తాడు.”

“అలాగైతే, ఇప్పుడు జరిగిన సంఘటనని దృష్టిలో పెట్టుకోని చూస్తే ఇంకా నా మీద, నా వాదన మీద వ్యాపారులలో నమ్మకం రాలేదని అనుకోవచ్చా?”

“నీ వాదనని అంగీకరించే వాళ్ళు కూడా ఇందాకటి సమావేశంలో వున్నారు. కానీ వాళ్ళు కూడా మిగిలిన వాళ్ళకి మద్దతు ఇవ్వడానికి ఒక కారణం వుంది. అది పూర్తిగా ఆర్థిక సంబంధమైన విషయం. ఇప్పుడు మేము తయారు చేస్తున్న వస్తువులను గమనిస్తే అవి ఎడమ చేతివాటం వాళ్ళు ఉపయోగించడానికి అనువుగా వుంటాయి. ఇప్పుడు వాటి స్థానంలో కుడి చేతివాటం వున్న వాళ్ళు ఉపయోగించుకునే వస్తువులు తయారు చెయ్యాలంటే మొత్తం మార్చుకోవాల్సి వస్తుంది. తయారికి ఉపయోగించే యంత్రాల నుంచి పనివాళ్ళ దాకా చాలా మార్పులు చెయ్యాలి. ఇదంతా చెయ్యాలంటే చాలా డబ్బు ఖర్చౌతుంది. ఇదంతా దృష్టిలో పెట్టుకోని చాలా మంది మీకు మద్దతు ఇవ్వలేకపోయారు. అదీ కాక ఇంతమందితో కలిసి వచ్చినప్పుడు మిగిలిన వాళ్ళని వ్యతిరేకించడం ఎవరికి మంచిది కాదని అందరికీ తెలుసు.” నవ్వాడాయన. మహాబసు కూడా చిరునవ్వు నవ్వాడు.

బయట జరుగుతున్న పోరు తాలూకు శబ్దాలు లోపలికి వినిపించడం మొదలుపెట్టాయి. వాటిని మొదటిసారి విన్న సిరిగిరి భయం ఆశ్చర్యం కలిపిన చూపుతో మహాబసు వైపు చూశాడు. మహాబసు నిబ్బరంగానే వున్నాయి. అయితే యుద్ధం చేసే పరిస్థితిలో మాత్రం లేదు. అతని దగ్గర ఎలాంటి ఆయుధాలు లేవు.

ఆ సమావేశ మందిరానికి వున్న ద్వారం నుంచి ఎవరో గట్టిగా అరుస్తూ వస్తున్నట్లు అనిపించింది.

<><><>

ఉప్పెనలా దూసుకొస్తున్న సైనికులను చూసి ఉగ్ర నిరుత్సాహపడిపోయాడు. అంతమందితో పోరాడటాం దాదాపు అసాధ్యం అని తెలుస్తూనే వుంది. అంతమాత్రాన వెనక్కు తగ్గే రకం కాదతను. మరణానికి ఏ నాడు భయపడింది లేదు. అది వీరమరణం అయితే ఇంకా ఆనందమే అతనికి. అతని బాధల్లా మహాబసు. ఆయన్ను కాపాడటం ఎలా? ఆలోచిస్తే ఒకటే ఉపాయం తట్టింది. నేరుగా సమావేశంలోకి వెళ్ళిపోయి ఆయన్ను తీసుకోని బయటికి రావాలని ప్రణాలిక వేశాడు. మహాబసు కూడా పోరాటంలో సాయం చేస్తాడు కాబట్టి త్వరగా తప్పించుకునే అవకాశం వుంటుంది. కొంత ప్రమాదం లేకపోలేదు కానీ అంత కన్నా అవకాశం లేదతనికి.

మహాబసుని ఒంటరిగా సమావేశానికి పిలిపించారు అన్నప్పుడే అతని మనసు కీడు శంకించింది. కానీ ఇంత ఖచ్చితంగా ప్రాణాపాయం వస్తుందని ఊహించలేదు. లేకపోతే విప్లవ సైన్యం మొత్తాన్ని తెచ్చి మహాబసు రక్షణకి నిలబెట్టేవాడు. ఏది ఏమైనా ఇంకా ఆలోచించడానికి సమయం లేదు. నిర్ణయం తీసేసుకున్నాడు.

"సుధామా. కాపు కాయి. నేను లోపలికి వెళ్తున్నా" అంటూనే వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళబోయాడు.

ఉగ్ర ఆదేశాలు విన్న సుధాముడు "అలాగే దేవరా" అన్నాడు తన పోరాటాన్ని కొనసాగిస్తూనే. అయితే సమాధానం ఇస్తూనే ఉగ్ర లోపలికి వెళ్ళటాన్ని క్రీగంట గమనించడానికి కళ్ళు తిప్పాడు. క్షణంలో సగభాగం. అయితే యుద్ధంలో అలాంటి ఒక చిన్న పొరపాటు శత్రు పక్షానికి అవకాశంగా మారచ్చు. సరిగ్గా అలాగే జరిగింది. అటు నుంచి రివ్వున వచ్చిన బాణం సుధాముడి కుడి భుజం కింద దిగబడింది. అతని చేతిలో బాణాలు జారిపోయాయి.

నిర్ఘాంతపోయాడు ఉగ్ర. ఉన్న ఒకే ఒక అవకాశం చేజారిపోవటం. గాయాల పాలైన సుధాముడు. ఇక మిగిలిన ఏకైక అడ్డు ఉగ్రని తొలగించడానికి సంసిద్ధంగా వున్న శత్రువులు. రెండు చేతులు విరిగిపోయిన వాడిలా నిలబడిపోయాడు ఉగ్ర. అదృష్టవశాత్తు సుధాముడు ఇంకా స్పృహలోనే వున్నాడు. సందర్భాన్ని అర్థం చేసుకోని వెంటనే స్పందించాడు.

"ఉగ్రా, నాకేం ఫర్వాలేదు. వెంటనే లోపలికి వెళ్ళు" అరిచాడు.

ఉగ్ర స్పందించలేదు. లోపలికి వెళ్తే మహాబసుని కాపాడుకోవచ్చు లేదా కాపాడుకోలేకపోవచ్చు. బయట వుంటే సుధాముణ్ణి కాపాడుకోవచ్చు. రెండు జరగలేదా, ఉగ్ర వీరమరణం పొందినట్లే. ఈ ఆలోచన మొత్తం ఒక మెరుపులా మెరిసింది. "జయహో మహాబసూ" అంటూ సైన్యం మీదకు ఉరికాడు.

సుధాముడు ఆశ్చర్యపోయాడు. ఉగ్ర మహాబసుని రక్షిస్తాడు అనుకుంటే తనని రక్షించాలని ప్రయత్నిస్తున్నాడు. అది వృధా ప్రయాస కావచ్చు. అసలు మహాబసుకి మరింత ప్రమాదకారి కావచ్చు. ఉద్యమానికే అశనిపాతం కావచ్చు. ఉగ్రని వారించాలనుకున్నాడు శక్తి లేదు. గత్యంతరం లేక అలాగే చూస్తూ ఉండిపోయాడు. అప్పుడు గమనించాడు – దళాధిపతి సైన్యం వెనుక భాగంలో ఏదో కలకలం మొదలైందని. ఇంకా కొంతమంది సైన్యం వచ్చి చేరుతున్నారు. కాదు. అలా అనిపిస్తోంది. కానీ నిజానికి వస్తున్నది వాళ్ళ సైన్యం కాదు. అది మహాబసు సైన్యం. ఉద్యమకారుల సైన్యం. ఎక్కడ లేని ఉత్సాహం పొంగుకుంటూ వచ్చింది.

"జయహో మహాబసూ... ఉగ్రా... అదిగో మన సైన్యం" అంటూ అరిచాడు.

అప్పటికే ఆరుగ్గురు సాయుధులైన సైనికులు ఉగ్ర చుట్టూ నిలబడి అతన్ని చంపడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. సుధాముడి కేక విన్న తరువాత ఆ ఆరుగ్గురు తలలూ ఒకేసారి తిప్పి సైన్యం వెనుక భాగం వైపు చూశారు. అక్కడ మరో యుద్ధం నడుస్తోంది.

అదే అదనుగా ఉగ్ర ఆ ఆరుగ్గురు తలలు తెగిపడేట్లు కొట్టాడు. అ తరువాత తల ఎత్తి చూశాడు.

"ద్వీపా!!" అప్రయత్నంగా అన్నాడు.

దళాధిపతి సైన్యం కకావికలం అయిపోయింది. అనుకోని ఈ దాడి దళాధిపతినీ, సిరిచరం, సిరివరం ముగ్గురినీ అయోమయానికి గురిచేసింది. ముందువైపు మహోగ్రుడిలా ఉగ్ర. వెనుక నుంచి వందలమంది సైన్యంతో ద్వీప. మిగిలిన రెండువైపుల పారిపోడానికి అవకాశం వుంది. ముందు సిరిచరం, సిరివరం తమ గుర్రాలను అటు కదిలించబోయారు. దళాధిపతి తన గుర్రంతో వాళ్ళని దాటి ముందుకు వెళ్ళి ఆగాడు. సరిగ్గా అదే సమయానికి ఉగ్ర సిరిచరం, సిరివరం మీదకు దూకు మెరుపులాంటి వేగంతో ఇద్దరినీ హతమార్చాడు. జరిగింది చూసి అక్కసుతో దళాధిపతి బాణం తీసి ఉగ్ర వైపుకి ఎక్కుపెట్టాడు.

ఎక్కువ సమయం లేదని అతనికి కూడా తెలుసు. ఆ బాణం తగిలితే సరే, తగలకపోతే మరో బాణం వేసే అవకాశం వుండకపోవచ్చు. ద్వీప సైన్యం దగ్గరపడుతున్న కొద్దీ ఆ అవకాశం సన్నగిల్లుతోంది. ఉగ్రని చూస్తే మెరుపు వేగంతో కదులుతున్నాడు. ఒక చోట స్థిరంగా వుండటం లేదు. వేసే బాణం వృధా అయ్యే అవకాశమే ఎక్కువ.

బాణం విడిచిపెట్టాడు. కాని అతను గురి చూసింది ఉగ్రని కాదు. సుధాముణ్ణి.

బాణం వచ్చి గుండెల్లో దిగబడింది సుధాముడికి. విలవిలలాడిపోయాడు.

దళాధిపతి తూర్పు దిక్కుకు గుర్రాన్ని పరుగెత్తించాడు. జరిగింది అర్థం చేసుకున్న ఉగ్ర అందుబాటులో వున్న బల్లాన్ని అందుకోని విసిరాడు కానీ అది దళాధిపతి ప్రాణాలను హరించలేకపోయింది. బల్లెం దళాధిపతి నడుముని తాకుతూ ముందుకు వెళ్ళినప్పుడు అది రాసుకుపోయిన చోట మాత్రం గాయమయ్యింది. ఆ గాయాన్ని ఎడమ చేత్తో పట్టుకోని కుడి చేతితో గుర్రాన్ని తోలుతూ ముందుకు వెళ్ళిపోయాడు. అతని పలాయనం చూసిన సైనికులు కూడ ఎటు వాళ్ళు అటు పరుగెత్తారు. అందిన వాళ్ళని అందినట్లు చంపుతూ ద్వీప, ఆమెతో వచ్చిన సైన్యం సుధాముడి దగ్గరకు చేరుకున్నారు. అప్పటికే ఉగ్ర అతనిని తన ఒడిలోకి తీసుకోని గాయాన్ని పరిశీలిస్తున్నాడు.

"ఎలా వుంది?" అడిగింది ద్వీప.

ఉగ్ర సమాధానం చెప్పలేకపోయాడు.

"బ్రతికే అవకాశం లేదు" చెప్పాడు సుధాముడు. "నా సంగతి తరువాత ముందు మహాబసు ఎక్కడున్నాడో చూడండి." అన్నాడు.

ద్వీప తన గుర్రం దిగి పరుగులాంటి నడకతో లోపలికి వెళ్ళింది. ఉగ్ర అలాగే సుధాముణ్ణి ఒళ్ళో పెట్టుకోని కూర్చున్నాడు. అతని కళ్ళ నుంచి కన్నీరు ధారగా కారుతోంది.

"నీ వీరత్వాన్ని, సేవలనీ సవ్యలంక ఎప్పటికీ మరిచిపోదు సుధామా" అన్నాడు బలహీనమైన గొంతుతో.

"నీకు అనుచరుడిగా వున్నందుకే నాకు అంత గౌరవం దక్కింది ఉగ్రా. మహాబసుకి సేవ చేసే అవకాశం, ఆయనకోసం వీరమరణం పొందే అవకాశం నా అదృష్టంగానే భావిస్తున్నాను." అన్నాడు. ఆ తరువాత మాట్లాడలేకపోయాడు. గుండెల్లో దిగిన బాణాన్ని చూపించి తీసేయమన్నట్లుగా సైగ చేశాడు.

ఉగ్రకి అర్థమైంది. ఆ బాణాన్ని లాగితే ఇక సుధాముడు మిగలడు. కానీ బాధని భరిస్తూ అనుక్షణం చావడం కన్నా ఒక్కసారిగా చనిపోవడం మేలని అతనా కోరిక కోరుతున్నాడు. ఉగ్ర మనసులో బాధని పళ్ళతో నొక్కిపట్టి కుడి చేతిని ప్రత్యేకంగా కనిపించేలా సుధాముడికి చూపించి అదే చేతితో బాణాన్ని పట్టుకోని బయటికి లాగాడు. చిన్న శబ్దం. ఒక్కసారి గట్టిగా శ్వాస తీసుకున్నాడు సుధాముడు. అదే అతని ఆఖరి శ్వాస.

అతన్ని గట్టిగా హత్తుకోని భోరుమన్నాడు ఉగ్ర.

సరిగ్గా అప్పుడే సమావేశ మందిరం లోపల్నించి ద్వీప కేక వినపడింది –

"ఉగ్రా, లోపల మహాబసు లేదు"

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS